
సాక్షి
గుంటూరు
శుక్రవారం । 19 । జూలై । 2024



మల్లేశ్వరుని కానుకల లెక్కింపు

పెదకాకాని: మల్లేశ్వరునికి కానుకల ద్వారా రూ.57,58,351 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసర శ్రీరామవరప్రసాద రావు చెప్పారు. గురువారం లెక్కింపు చేపట్టారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 2010 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1611 క్యూసెక్కులు విడుదల చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 505.10 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,700, ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



వినుకొండలో నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే రషీద్‌ను కత్తితో నరుకుతున్న జిలాని

- దాడులు, హత్యాయత్నాలతో అట్టుడుకుతున్న జిల్లా
- నీచ రాజకీయాలకు ఫ్యాక్షన్‌ను ఎగదోసిన చంద్రబాబు
- గెలుపు కోసం కరడుగట్టిన హంతకులకు బాధ్యతలు
- ఎల్లో కూటమి విజయం తర్వాత రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు
- వైఎస్సార్ సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా దాడులు, హత్యలు
- తాజాగా పాశవిక హత్యతో రాక్షసత్వాన్ని చాటుకున్న పచ్చదండు

నారా హంతక ముఠా నరమేధం

రక్తమోడుతున్న పల్నాడు

పగలు, ప్రతీకారాలను వదిలి ప్రశాంత వాతావరణంలో అభివృద్ధి పథాన పయనిస్తున్న పల్నాడులో 'నారా' హంతక ముఠా మళ్లీ ఫ్యాక్షన్ చిచ్చును రాజేసింది. ఎన్నికల్లో గెలుపు కోసం కరడుగట్టిన నేరస్తులను ఎగదోసి హింసాకాండను సాగించింది. ఎన్నికల రోజు, ఆ తర్వాత వైఎస్సార్ సీపీ నాయకులు, శ్రేణులే లక్ష్యంగా దాడులు, విధ్వంసాలకు తెగబడింది. కుయుక్తులతో కూటమిగట్టి గెలిచిన తర్వాత కాల'కూటమై' కోరలు చాస్తోంది. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోంది. నరమేధాన్ని సృష్టించి బలి కోరుతోంది. రక్తతర్పణాలతో పల్లెసీమలను తడుపుతోంది. రాక్షసానందంతో వికటాట్టహాసం చేస్తోంది.



కారెంపూడిలో ఎన్నికల తర్వాత వైఎస్సార్ సీపీ నేత ఆటో కన్సల్టెన్సీలోని వాహనాలకు నిప్పు పెట్టిన దృశ్యం




బ్రాహ్మణపల్లిలో గాయపడిన సొసైటీ చైర్మన్ పిచ్చిరెడ్డి, పాటూరి శ్రీనివాసరావు



తుమ్మలచెరువులో క్షతగాత్రుడు



పెద అగ్రహారంలో గాయపడిన కృష్ణ

రిగ్గింగ్‌కు తెగబడి..!

తుమ్మకోట గ్రామంలో తెలుగుదేశం పార్టీ రిగ్గింగ్‌కు పాల్పడినప్పుడు ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈవీఎంలూ ధ్వంసమయ్యాయి. వెల్దుర్తిలోని 137, 138, 139, 140, 141 పోలింగ్ స్టేషన్లలో రాత్రి ఏడు గంటల తర్వాత వైఎస్సార్ సీపీ ఏజెంట్లను బయటకు పంపి రిగ్గింగ్ చేశారు. ఒప్పిచర్ల గ్రామంలో 250, 251, 252, 256 పోలింగ్ స్టేషన్లలో ఇతర సామాజిక వర్గాల వారు ఓటు వేసుకోలేని పరిస్థితిని సృష్టించారు.

పిన్నెల్లి సతీమణిపై దాడి

ఎన్నికలకు మూడు రోజుల ముందు మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సతీమణి సిరిగిరిపాడు గ్రామంలో ప్రచారం చేస్తుండగా ఆమెపై టీడీపీ నేతలు దాడి చేశారు. బందోబస్తుగా వచ్చిన ఎస్‌ఐ ఇతర పోలీసు సిబ్బందిపైనా దాడికి తెగబడ్డారు.

పాశవిక చర్యలకు పరాకాష్ట



రాష్ట్రంలో కూటమి పాలనలో పాశవిక చర్యలు పరాకాష్టకు చేరాయి. శాంతిభద్రతలను కాపాడాల్సిన ప్రభుత్వం ఉదాసీన వైఖరిని అవలంబిస్తున్నందునే అత్యంత దారుణాలు, దుర్మార్గాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. దాడులు మొదలైనప్పుడే పోలీసు ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకుని ఉన్నట్లయితే ఇంతటి ఉన్మాద చర్యలు చోటుచేసుకునేవి కావు. టీడీపీ ముఖ్య నాయకులు ప్రోత్సహిస్తున్నందునే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బరితెగిస్తున్నారు. ఇలాంటి హేయమైన చర్యలను ప్రతిఒక్కరూ తీవ్రంగా ఖండించాల్సిందే.

– మర్రి రాజశేఖర్, ఎమ్మెల్సీ



ముప్పాళ్ల మండలం తొండపిలో వాహనం ధ్వంసం

సాక్షి ప్రతినిధి, గుంటూరు, సాక్షి, నరసరావుపేట: ఒకప్పుడు ఫ్యాక్షన్‌తో రగిలిన పల్నాడు గత ఐదేళ్లలో కక్షలకు దూరంగా జరిగింది. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి బాటలెక్కింది. దీనిని చూసి ఓర్వలేక టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పరిస్థితి ఇలాగే కొనసాగితే తన పార్టీకి మనుగడ ఉండదన్న భావనతో ఫ్యాక్షన్‌కు మళ్లీ ప్రాణం పోశారు. రాజకీయాలకు దూరంగా ఉంటున్న కరడుగట్టిన ఫ్యాక్షనిస్టు జూలకంటి బ్రహ్మారెడ్డిని మాచర్ల ఇన్‌చార్జిగా నియమించారు. పల్నాడులో అలజడి సృష్టించేందుకు యత్నించారు. ఎన్నికల సమయంలో గెలుపే లక్ష్యంగా పచ్చమూకలను ఉసిగొలిపి దాడులు, విధ్వంసాలకు ఒడిగట్టారు. జిల్లాలోని 53 గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై మారణాయుధాలతో దాడులకు తెగబడ్డారు. ఇళ్లపై పడి ఆస్తులు ధ్వంసం చేశారు. చాలా మందిని ఊళ్ల నుంచి తరిమేశారు.

ఎన్నికల ముందు నుంచే దాడులు

ఎన్నికల సమయంలో మాచర్లలో జెండా పాతడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ సాగించిన విధ్వంస కాండకు పోలీసు ఉన్నతాధికారులు, సర్కిల్ అధికారులు అండగా నిలిచారు. జరుగుతున్న పరిణామాలపై ఎప్పటికప్పుడు ఫిర్యాదు చేస్తున్నా డీఐజీ గానీ, ఎస్పీ గానీ, కలెక్టర్ గానీ స్పందించ లేదు. మాచర్లలో జూలకంటి బ్రహ్మారెడ్డిని ఎప్పుడైతే అభ్యర్థిగా ప్రకటించారో అప్పటి నుంచి అరాచకాలు మొదలయ్యాయి. పల్నాడును కైవసం చేసుకోవాలంటే జిల్లాలో అప్పుడు ఉన్న ఐజీ, ఎస్పీ ఇతర అధికారులు ఉంటే తమ పన్నాగాలు పారవని టీడీపీ నేతలు గుర్తించారు. అప్పటి ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకున్నారు. ఆయన ఉంటే బూత్ క్యాప్చర్, ఓటర్లను భయపెట్టడం కుదరదని అభిప్రాయపడ్డారు. అప్పుడే పొత్తు పెట్టుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ద్వారా పావులు కదిపారు. తమకు అనుకూలంగా ఉండే అధికారులకు పోస్టింగ్ ఇప్పించుకున్నారు.

టీడీపీ వేధింపులకు బలి



చిలకలూరిపేటలో తెలుగుదేశం నాయకుల దాష్టీకానికి ఓ నిండు ప్రాణం బలైంది. గోపాళంవారిపాలెం గ్రామానికి చెందిన జడ ఆనంద్ (38) ఎన్నోఏళ్లుగా ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేశాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆనంద్‌ను ఉద్యోగానికి రాజీనామా చేయాలని ఒత్తిడి చేశారు. లేకుంటే క్రిమినల్ కేసులు పెట్టి అరెస్టు చేయిస్తామని బెదిరించారు. తీవ్ర మనస్తాపానికి గురైన ఆనంద్ పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడికి భార్య రత్నకుమారితోపాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

రెంటపాళ్లలో మరొకరు..



పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామ ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ క్రియాశీలక కార్యకర్త కొర్లకుంట నాగమల్లేశ్వరరావు (37) టీడీపీ నేతల ఒత్తిడితో, పోలీసుల వేధింపులు తాళలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎన్నికల ఫలితాల తర్వాత టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు నాగమల్లేశ్వరరావు ఇంటిపై, ఎస్సీ కాలనీపై దాడులకు దిగారు. ఈ నేపథ్యంలో గ్రామం విడిచి వెళ్లకపోతే రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపుతామని ఎస్‌హెచ్‌ఓ రాజేష్‌కుమార్ బెదిరించడంతో మనస్తాపం చెంది నాగమల్లేశ్వరరావు ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఆర్‌ఎంపీపై హత్యాయత్నం



పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం బట్లూరు గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు పోట్లూరి శివయ్య వైఎస్సార్ సీపీకి అనుకూలంగా పనిచేశాడనే కోపంతో ఆయన ఇంటిపై టీడీపీ నాయకులు మారణాయుధాలతో దాడి చేశారు. శివయ్య కుడి చేతికి కత్తిపోటుతో గాయమైంది. దీనిపై అప్పటి ఎస్పీ మలికా గార్గ్‌కు శివయ్య ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు పంపారు. ఈ కేసులో రాజీ పడటం లేదని శివయ్యపై ప్రస్తుతం తప్పుడు కేసులు పెట్టేందుకు యత్నిస్తున్నారు.

పల్లెల్లో పచ్చ చిచ్చు

తొలుత ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో పచ్చమూకలు అలజడి సృష్టించాయి. దాడులను ప్రేరేపించాయి. మాచర్ల మండలంలోని కొత్తూరు, కంభంపాడు, భైరవునిపాడు, రెంటచింతల మండలంలోని జెట్టిపాలెం, పాల్వాయిగేటు, గోలి, మిట్టగుడిపాడు, కారెంపూడి మండలంలోని ఒప్పిచర్ల, కారెంపూడి, పేటసన్నెగండ్ల, చింతపల్లి, దుర్గి మండలంలోని ముటుకూరు, అడిగొప్పల, పోలేపల్లి, వెల్దుర్తి మండలంలోని లోయపల్లి, వెల్దుర్తి, వజ్రాలపాడు, గొట్టిపాడు, నర్సపెంట గ్రామాల్లో టీడీపీ మూకలు దాడులకు తెగబడ్డాయి. గురజాల నియోజకవర్గంలో పిన్నెలి, కేసానుపల్లి, మాదినపాడు, ఇరిగేపల్లి, తంగెడ, కొత్తగణేశునిపాడు, మాచవరం, బ్రాహ్మణపల్లి, పెదఅగ్రహారం, జానపాడు, నరసరావుపేట నియోజకవర్గంలో నరసరావుపేట పట్టణం, దొండపాడు, పమిడిపాడు, సత్తెనపల్లి నియోజకవర్గంలో పాకాలపాడు, మాదల, తొండపి, చాగంటివారిపాలెం, నార్నెపాడు, గణపవరం, చీమలమర్రి, రూపెనగుండ్ల, గుండ్లపల్లి, కుంకలగుంట, చేజర్ల, వినుకొండ నియోజకవర్గంలో నూజెండ్ల, రెడ్డికొత్తూరు, బొల్లాపల్లి, కొచ్చర్ల, గంటావారిపాలెం, వినుకొండ పట్టణం, పెదకూరపాడు నియోజకవర్గంలో ఎర్రబాలెం, లగడపాడు, చంద్రాజుపాలెం, మాదిపాడు, చిలకలూరిపేట నియోజకవర్గంలోని అప్పాపురం గ్రామంలో పచ్చ ముఠాలు విధ్వంసం సృష్టించాయి.

ఎస్సీ మహిళలపై అరాచకం

రెంటచింతల మండలం తుమ్మకోటలో మే 13న ఓటు వేసేందుకు వెళ్తున్న ఎస్సీ, ఎస్టీ మహిళలపై టీడీపీలోని అగ్రకుల నాయకులు విచక్షణారహితంగా దాడి చేశారు. అప్పటికే క్యూలైన్లలో ఉన్న మహిళలను కొట్టి తరిమివేసి టీడీపీ నేతలు రిగ్గింగ్ చేశారు. పోలింగ్ బూత్‌లో ఉన్న వైఎస్సార్ సీపీ ఏజెంట్లను లాగి బయటకు గెంటేశారు.

మరిన్ని దురాగతాలు

- వినుకొండ నియోజకవర్గం నూజెండ్లలో టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. ఎన్నికలు పూర్తయిన మరుసటి రోజు పక్కా ప్రణాళిక ప్రకారం ప్రధాన సెంటరులో వైఎస్సార్ సీపీ నాయకులపై రాళ్లు కర్రలతో దాడులు చేశారు. దాడిలో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు.
- కారెంపూడిలో టీడీపీ గూండాలు 500 మంది బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు షేక్ కరీంకు చెందిన వాచ్ షాపును ధ్వంసం చేశారు.
- కారెంపూడి ఎంపీపీ బొమ్మిన సావిత్రికి చెందిన పాలకేంద్రాన్ని ధ్వంసం చేసి తగలబెట్టారు. మాచర్ల రోడ్డులోని పోలిరెడ్డికి చెందిన టీ స్టాల్‌ను ధ్వంసం చేశారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలోకి చొరబడి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అక్బర్ నివాసంపై దాడి చేశారు. ఎంపీటీసీ వేముల పద్మావతి భర్త నిర్వహిస్తున్న ఆటో కన్సల్టెన్సీపై దాడి చేసి 40 బైక్‌లకు నిప్పు పెట్టారు.
- ఇందిరా గాంధీ బొమ్మ సెంటర్‌లోని అపార్ట్‌మెంట్‌లో నిలిపి ఉంచిన వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి కారును ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యదర్శి కొమ్ము చంద్రశేఖర్ నివాసానికి నిప్పు పెట్టారు.
- మాచవరం మండలం కొత్త గణేశునిపాడు, కేసానుపల్లిల్లో మహిళలను కొట్టారు.



వంతపాడిన పోలీసులు



దాడులు చేసిన తెలుగుదేశం పార్టీ వారిని వదిలిపెట్టి పోలీసులు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపైనే కేసులు పెడుతూ వచ్చారు. అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పిన్నెల్లి వెంకటరామిరెడ్డి, అప్పటి నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై కేసులు నమోదు చేశారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటిపై దాడి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ నేతలపై హత్యాయత్నం కేసులలో నిందితుడైన టీడీపీ నరసరావుపేట ఎమ్మెల్యే అరవింద్‌బాబు, అతని అనుచరులను అరెస్ట్ చేయలేదు.

తాజాగా వినుకొండలో వైఎస్సార్ సీపీ కార్యకర్త రషీద్‌ను అతి దారుణంగా హత్య చేశారు. ఇప్పటికైనా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి పల్నాడులో శాంతిని నెలకొల్పాల్సిన అవసరం జిల్లా యంత్రాంగంపై ఉంది.

పోలింగ్ రోజు విధ్వంసకాండ



ఎన్నికల రోజున నరసరావుపేట వైఎస్సార్ సీపీ అభ్యర్థి, అప్పటి ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఇంటిపైకి రెండు వందల మంది తెలుగుదేశం పార్టీ మూకలు మారణాయుధాలు చేతబట్టి దాడికి తెగబడ్డాయి. ఆ సమయంలో శ్రీనివాసరెడ్డి ఇంట్లో లేకపోవడంతో ఆయన మామ కంజుల రామకోటిరెడ్డిపై టీడీపీ కిరాయి గూండాలు దాడి చేశారు.



గాయపడిన గోపిరెడ్డి మామ రామకోటిరెడ్డి

> ఎన్నికల ముందే కారెంపూడి మండలం వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డిపై దాడి చేసి టీడీపీ నేతలు బెదిరించారు. మే 12న రెంటచింతలలో పోలీసులు ఉండగానే మోర్తాల ఉమా మహేశ్వరరెడ్డిపై దాడి చేశారు. రెంటచింతల మండలం పాల్వాయి గేట్ వద్ద 201, 202 పోలింగ్ స్టేషన్లలోకి వైఎస్సార్ సీపీ ఏజెంట్లనూ తెలుగుదేశం నేతలు అనుమతించలేదు.

బేడ, బుడగ జంగాలపై దాడి

- మాచర్ల నియోజకవర్గం కారెంపూడి మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామ శివారు బాలచంద్ర నగర్ (పోతురాజుగుట్ట)లో నివాసం ఉంటున్న బేడ, బుడగ జంగాలు తమకు ఓటు వేయలేదని ఆగ్రహించిన టీడీపీ గూండాలు సుమారు 70 మంది పోలింగ్ ముగిశాక వారి ఇళ్లపై పడి కనపడిన వారిని కనపడినట్లు కర్రలు, రాళ్లతో దాడి చేసి కొట్టారు. మహిళలు, పిల్లలని కూడా చూడకుండా చావబాదారు. ఇళ్లలోని సామగ్రిని నాశనం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పెల్లూరి కోటయ్యకు చెందిన స్కార్పియో వాహనాన్ని ధ్వంసం చేశారు. గొర్ల సైదులు చేయి, కాలిపై కర్రలతో బాదారు. కత్తెర లక్ష్మి చేయి విరగ్గొట్టారు. రాళ్ల దాడితో అందరూ ప్రాణభయంతో ఇంటి నుంచి పారిపోయారు.
- మాచర్ల నియోజకవర్గం రెంటచింతల మండల పరిధిలోని గోలి గ్రామంలో వైఎస్సార్ సీపీకి చెందిన మూఢావత్ మల్లయ్యనాయక్, మూఢావత్ కొండానాయక్, ఆర్. నాగేశ్వరరావు నాయక్, మూఢావత్ నాగేశ్వరరావు నాయక్‌లపై టీడీపీ నేతలు దాడి చేసి గాయపరిచారు.

కొత్త గణేశునిపాడులో అరాచకం



గాయపడిన చౌదరి సింగరయ్య

ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేయలేదన్న అక్కసుతో ఆ పార్టీ నేతలు మాచవరం మండలం కొత్త గణేశునిపాడులో అరాచకం సృష్టించారు. దాడుల్లో వైఎస్సార్ సీపీ నేతలు చౌదరి సింగరయ్య, దారం లక్ష్మిరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. టీడీపీ నేతలకు భయపడి ఎస్టీ, బీసీ నేతలు ఊరు వదిలారు. మహిళలు, చిన్న పిల్లలు గంగమ్మ గుడిలో తలదాచుకున్నారు. ఇది తెలిసి పచ్చమూకలు గుడిపైకి రాళ్లు రువ్వారు. బాధితులను పరామర్శించడానికి వెళ్లిన వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు అనిల్ కుమార్, కాసు మహేష్‌రెడ్డిపైనా దాడులు చేశారు. పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి నాయకులను గ్రామాలు దాటించాల్సిన పరిస్థితి నెలకొంది. టీడీపీ నేతలకు భయపడి పిన్నెల్లి గ్రామం నుంచి సుమారు 1,050 మంది పక్కనే ఉన్న తెలంగాణకు పరారై తలదాచుకుంటున్నారు. పిన్నెల్లిలో ఇప్పటికీ దాడులు జరుగుతూనే ఉన్నాయి. సాగు చేపట్టకపోవడంతో వందల ఎకరాలు బీడుగా మారాయి.



గాయపడిన దారం లక్ష్మీరెడ్డి

తొండపిలో మైనార్టీలపై పైశాచికం



సత్తెనపల్లి నియోజకవర్గం ముప్పాళ్ల మండలం తొండపి గ్రామంలోని వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైన ముస్లిం వర్గీయుల ఇళ్లల్లోకి టీడీపీ మూకలు చొరబడ్డాయి. మహిళలను, చిన్నారులని చూడకుండా దాడులకు తెగబడ్డాయి. ఈ తరుణంలో ముస్లిం కుటుంబాల్లోని మగవారంతా ప్రాణాలు కాపాడుకునేందుకు పొలాల్లోకి పరుగులు తీశారు. మహిళలు, చిన్నారులు తలుపులు వేసుకొని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ లోపలే ఉండిపోయారు. వైఎస్సార్ సీపీ మద్దతుదారులు గ్రామం వదిలి వెళ్లిపోయారు.

- పెదకూరపాడు నియోజకవర్గం కంభంపాడులో వైఎస్సార్ సీపీకి పట్టున్న ఎస్సీ, బీసీ కాలనీలపై టీడీపీ నేతలు పోలింగ్ రోజు దాడులకు పాల్పడ్డారు. పోలింగ్ కేంద్రాల వద్ద కూడా వీరంగం వేశారు. మహిళలు అని కూడా చూడకుండా దాడులకు పాల్పడ్డారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన జిల్లా ఎస్పీ



నగరంపాలెం: గుంటూరు నగరంపాలెం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథిని గురువారం జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పెండింగ్ కేసులు తగ్గించేందుకు, లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించేందుకు న్యాయ శాఖ, పోలీస్ శాఖ సమన్వయంతో పని చేయాలని, బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం అందించాలనే అంశాలపై చర్చించారు. బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం అందించేందుకు పోలీస్ శాఖ నుంచి కృషి చేస్తామని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు.

జిల్లాలో సగటు వర్షపాతం 10.1మి.మీటర్లు

అత్యధికంగా తెనాలిలో 28.4 మి.మీ

కొరిటెపాడు(గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు సగటున 10.1 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తెనాలి మండలంలో 28.4 మిల్లీ మీటర్లు వర్షం కురిసింది. అత్యల్పంగా మేడికొండూరు మండలంలో 0.4 మి.మీ వర్షం కురిసింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. తుళ్లూరు మండలంలో 26.2 మి.మీ., దుగ్గిరాల 24.6, మంగళగిరి 24, తాడికొండ 21.2, పెదకాకాని 20.2, తాడేపల్లి 19.6, కొల్లిపర 12.6, గుంటూరు పశ్చిమ 1.8, కాకుమాను 1.2, గుంటూరు తూర్పు 1, చేబ్రోలు మండలంలో 0.8 మి.మీ చొప్పున వర్షం కురిసింది. జూలై 18వ తేదీ నాటికి సాధారణ వర్షపాతం 95.8 మి.మీ కురవాల్సి ఉండగా, ఇప్పటి వరకు 139.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మరో మూడు రోజులపాటు జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. వెద పద్ధతిలో సాగు చేసిన వరి పంట, పత్తి పొలాల్లో అధిక వర్షాలకు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు బయటకు వెళ్లే విధంగా చూడాలన్నారు.

ఆరోగ్య పరీక్షలు ఉచితంగా అందించాలి

- కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి
- తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన



డీప్ ఫ్రీజర్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

తాడేపల్లిరూరల్: ఆస్పత్రికి వచ్చే రోగులకు అన్ని ఆరోగ్య పరీక్షలు ఉచితంగా అందించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షలు బయట చేయించరాదని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌తో కలసి గురువారం సందర్శించారు. తొలుత ఆరోగ్య కేంద్రంలోని జనరల్ వార్డు, లేబర్ వార్డు, ల్యాబ్ పరీక్షలు నిర్వహించే గదులను, ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు సంబంధించిన అన్ని రికార్డులు, రిజిస్టర్లను, వ్యాక్సిన్ గదిలోని ఐఎల్ఆర్, డీప్ ఫ్రీజర్‌ను పరిశీలించి సూచనలు, సలహాలు అందించారు. అనంతరం కలెక్టర్ వైద్యాధికారులతో మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆరోగ్య కేంద్ర పరిధిలో గర్భిణులను గుర్తించి వారి పేర్లు నమోదు చేయాలని, వారికి అవసరమైన ఐరన్, కాల్షియం టాబ్లెట్లు అందజేయాలని అన్నారు. హైరిస్క్ ఉన్న గర్భిణులకు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి సజావుగా కాన్పు జరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రాత్రి సమయంలో నర్స్, హెడ్ నర్స్ ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉండాలని, అవసరమైన పక్షంలో మెడికల్ డాక్టర్ వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు, ప్రైమరీ హెల్త్ సెంటర్ మెడికల్ అధికారులు డాక్టర్ అనూష, డాక్టర్ శాంతి, తాడేపల్లి తహసీల్దార్ టి.విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సతీష్ పాల్గొన్నారు.

పెనుమాక పాఠశాల పరిశీలన

ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిశీలన అనంతరం పెనుమాకలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌తో కలసి పరిశీలించారు. పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలించి పరిశుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు పనులు చేయాలని, పాఠశాల ఆవరణలో నీరు నిల్వ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఆర్‌ఓ వాటర్‌ను విద్యార్థులకు అందించాలని ప్రధానోపాధ్యాయుడు రెహమాన్‌కు సూచించారు. మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులను కలసి భోజనం ఎలా ఉంది, మెనూ ప్రకారం అందజేస్తున్నారా లేదా, పుస్తకాలు, యూనిఫారం అందాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. అనంతరం స్కూల్ కాంపౌండ్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలోని ఆహార పదార్థాల స్టాక్, కోడిగుడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.విజయ్‌కుమార్, ఎంఈఓ నాగేశ్వర్, డిప్యూటీ తహసీల్దార్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీగా ఆచార్య గంగాధరరావు



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్‌గా యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతులు ఆచార్య కంచర్ల గంగాధరరావును నియమిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరభ్ గౌర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య గంగాధరరావు ప్రస్తుతం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆచార్య గంగాధరరావు పర్యవేక్షణలో 10 మంది పీహెచ్‌డీ పొందారు. మరో 12 మంది పరిశోధన చేస్తున్నారు. ఇప్పటి వరకు అంతర్జాతీయ స్థాయిలో 66, జాతీయ స్థాయిలో 2 ప్రచురణలు చేశారు. ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ యంగ్ సైంటిస్ట్‌గా గతంలో ఎంపికయ్యారు.

జేఎన్‌టీయూ జీవీ ఇన్‌చార్జి వీసీగా రాజ్యలక్ష్మి



విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ దావులూరి రాజ్యలక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఆమె ఇదే యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. గుంటూరు జిల్లా అమర్తలూరు మండలం బోడపాడు స్వగ్రామం. నిడుబ్రోలులో పాఠశాల విద్య, గుంటూరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నికల్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ విభాగంలో డిప్లమా, ఏయూలో బీటెక్, ఎంటెక్ పూర్తిచేసి 'కంటెంట్ బేస్డ్ ఇమేజ్ రీట్రివల్ యూజింగ్ సిగ్నేచర్ బేస్డ్ సిమిలారిటీ'లో పీహెచ్‌డీ చేశారు. ఆమె పర్యవేక్షణలో 15 మంది విద్యార్థులు పీహెచ్‌డీ పట్టాపొందారు. మరో ఆరుగురు పీహెచ్‌డీ పట్టాలు అందుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. ఉన్నత విద్యానంతరం వివిధ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లోనూ, డీమ్డ్ యూనివర్సిటీల్లో బోధన రంగంలో పనిచేశారు. జేఎన్‌టీయూ (కాకినాడ) విజయనగరం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా 2013 నుంచి కొనసాగుతున్నారు. ఇంతవరకు ఇక్కడ వీసీగా పనిచేసిన ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య ఇటీవల స్వచ్ఛందగా రాజీనామా చేసిన విషయం తెలిసిందే. రాజ్యలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

సమష్టి కృషితో హెచ్‌ఐవీ బాధితులకు మెరుగైన సేవలు

ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ క్లస్టర్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శ్యామ్‌సన్



మాట్లాడుతున్న డాక్టర్ శ్యామ్‌సన్

తెనాలిఅర్బన్: ఉద్యోగుల సమష్టి కృషితో హెచ్‌ఐవీ బాధితులకు మెరుగైన సేవలు అందించవచ్చని ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ క్లస్టర్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ శ్యామ్‌సన్ పేర్కొన్నారు. తెనాలి ఏఆర్‌టీ సెంటర్‌లో గురువారం ఉద్యోగులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డెల్టా ప్రాంతంలో ఉన్న హెచ్‌ఐవీ బాధితులకు ఇక్కడ వైద్యసేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి నెలా 6,800 మందికి మందులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి బాధితుడు 28 రోజులలోపే వచ్చి మందులు తీసుకోవాలని సూచించారు. అలా చేయకపోతే ఆరోగ్యం క్షీణించే అవకాశం ఉందన్నారు. సమావేశంలో వైద్యాధికారులు డాక్టర్ రమ్యకృష్ణ, డాక్టర్ స్నేహశ్రీ, జిల్లా ఐసీటీసీ కో–ఆర్డినేటర్ జ్యోతుల వీరాస్వామి, షేర్ ఇండియా ప్రాజెక్టు ఆఫీసర్ రత్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పట్నంబజారు: ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గుంటూరు–2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాం గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయాలని తెలిపారు. ప్రయాణికులు వారి సూచనలు, సలహాల కోసం 99592254212 నంబరులో సంప్రదించాలన్నారు.

లైంగికదాడికి పాల్పడిన ఆటో డ్రైవర్ అరెస్టు

14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన న్యాయస్థానం

ప్రత్తిపాడు: దళిత బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడికి న్యాయస్థానం పద్నాలుగు రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడు గ్రామంలో ఎనిమిదో తరగతి చదువుతున్న పదమూడు సంవత్సరాల దళిత బాలికపై అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గండికోట వెంకట కోటేశ్వరరావు అలియాస్ వెంకట్ లైంగికదాడికి పాల్పడంతో, అతనిపై పోక్సోతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం నిందితుడు వెంకట్‌ను గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ మహబూబ్‌బాషా నడింపాలెం జాతీయ రహదారిపైనున్న అండర్ పాస్ వద్ద అదుపులోనికి తీసుకుని అరెస్టు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా వెంకట్‌కు న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ప్రత్తిపాడు ఇన్‌చార్జి ఎస్ఐ రవీంద్ర తెలిపారు.

భార్యపై హత్యాయత్నం చేసిన భర్త

గుంటూరు ఈస్ట్: ఓ వ్యక్తి భార్యను వేధించి హత్యాయత్నం చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బృందావన్‌గార్డెన్స్‌కు చెందిన సుబ్రహ్మణ్యం, శశిదేవి దంపతులు సింగపూర్‌లో కాపురం పెట్టారు. సుబ్రహ్మణ్యం భార్య శశిదేవిని తరచూ వేధించేవాడు. దిండుతో మొఖం కప్పి హత్యాయత్నం చేశాడు. శశిదేవి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెన్యువల్ చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్టు అధ్యాపకులను రెన్యువల్ చేయాలని ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపక సంఘ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బీజే గాంధీ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 3,618 మందిని నూతన విద్యాసంవత్సర ప్రారంభానికి ముందుగానే రెన్యువల్ చేయాలని, గత ఏప్రిల్, మే నెలల్లో అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. కాంట్రాక్టు అధ్యాపకుల పునరుద్ధరణ విషయాన్ని నూతన ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులతోపాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని తెలిపారు. దీనిపై సీఎం, విద్యాశాఖ మంత్రి దృష్టి సారించి కాంట్రాక్టు అధ్యాపకులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీకాకుళంపై చిత్తూరు జట్టు ఆధిక్యం



సోహాన్‌రెడ్డి

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో గల ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న అండర్–16 మల్టీడే ఇంటర్ జోనల్ పోటీల్లో గురువారం చిత్తూరు, శ్రీకాకుళం జట్ల మధ్య మ్యాచ్ నిర్వహించారు. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుని బరిలోకి దిగింది. 48 ఓవర్లలో 169 పరుగులు తీసింది. చిత్తూరు జట్టుకు చెందిన సోహాన్‌రెడ్డి 46 బాల్స్‌లో 41 పరుగులు తీయగా, హర్షవర్ 66 బాల్స్‌కు 38 పరుగులు తీశాడు. మొత్తం 10 వికెట్లకు 169 పరుగులు చేసింది చిత్తూరు జట్టు. శ్రీకాకుళం జట్టులో సాయి వెంకట ప్రణీత్ 42 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టులో వి.క్రాంతి 13 బాల్స్‌లో ఎనిమిది పరుగులు చేశాడు. శ్రీకాకుళం 156 పరుగులు చేయగా 13 పరుగుల తేడాతో చిత్తూరు జట్టు గెలుపొందింది.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తెనాలిలోని పినపాడు రైల్వేగేటు వద్ద చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుమారు 40 ఏళ్ల వ్యక్తి బుధవారం రాత్రి పొద్దుపోయాక పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొటడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో పోలీసులు ఘటనాస్థలాన్ని గురువారం పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాగరాజు కోసం పది ప్రత్యేక బృందాలు

చేబ్రోలు: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం దళితవాడ ప్రాంతానికి చెందిన బాలిక మృతికి కారణమైన నిందితుడు నాగరాజును పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాల ద్వారా గాలిస్తున్నారు. ఈ నెల 15వ తేదీన స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న పేరుపోగు శైలజ అనుమానాస్పద స్థితిలో హత్యకు గురైంది. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితుడి కోసం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బందితో పది ప్రత్యేక బృందాలు వివిధ ప్రాంతాల్లో సాంకేతిక పరిజ్ఞానంతో పరిశీలన చేస్తున్నారు. నేర చరిత్ర కలిగిన నిందితుడు పోలీసుల కళ్లుగప్పి పరారవటం తలనొప్పిగా మారింది. సంఘటన జరిగిన ఐదు రోజులైనప్పటికి నిందితుడు ఆచూకీ లభించకపోవటంతో పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి సారించారు.

హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి



హెల్మెట్ లేని చోదకులతో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

నగరంపాలెం: మోటారు సైకిళ్లను నడిపే ప్రతి వాహనచోదకుడు హెల్మెట్ ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ వైవీఎస్‌బీజీ పార్థసారథి స్పష్టం చేశారు. రాష్ట్ర హైకోర్టు, న్యాయ సేవాధికార సంస్థ (అమరావతి) ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం వన్‌కే నడక ప్రారంభించారు. హెల్మెట్ ధరించండి, మీ ప్రాణాలను కాపాడండి అంటూ ప్లకార్డులతో కొనసాగింది. జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి ప్రారంభమై, సాయిబాబా గుడి, జిల్లా కలెక్టరేట్ మీదగా జిల్లా కోర్టు వద్ద ముగిసింది. ర్యాలీగా వెళ్తున్న క్రమంలో హెల్మెట్ లేకుండా కనిపించిన వారికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి క్లాస్ తీసుకున్నారు. హెల్మెట్ ఆవశ్యకతను వారికి వివరించారు. అనంతరం జిల్లా కోర్టు వద్ద మోటారు వాహనాల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి మాట్లాడుతూ హెల్మెట్‌లపై ప్రజలకు అవగాహన కల్పించడమే ర్యాలీ ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. అనేక మంది వాహనచోదకులు హెల్మెట్‌లు ధరించడంలేదని తెలిపారు. తద్వారా అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని అన్నారు. పిల్లలకు మోటారుసైకిళ్లను ఇవ్వవద్దని తల్లిదండ్రులకు స్పష్టం చేశారు. ఒకవేళ ఏదైనా ప్రమాదాలు జరిగితే ఇరు కుటుంబాలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని చెప్పారు. అంతేగాక చాలా వాహనాలకు బీమా చేయించడం లేదని, నాలుగైదు కేసులు నమోదైతే, అందులో మూడు కేసుల్లో మోటారు సైకిళ్లకు బీమా ఉండటంలేదన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే బీమా ద్వారా బాధిత కుటుంబాలకు కొంతమేర మేలు జరుగుతుందని చెప్పారు. సంస్థ జిల్లా కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) టి.లీలావతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ వాడితే అందరికి ప్రయోజనకరమని అన్నారు. తద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చునని చెప్పారు. సదస్సులో పోలీస్, రవాణా శాఖ అధికారులు, బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి, జిల్లా కోర్టు సిబ్బంది, ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్స్ పాల్గొన్నారు.

పట్టిస్తే ... వదిలేశారు..

- ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం చేసిన రాజమండ్రి వ్యక్తి
- ఆరు నెలలుగా ఎవరికి కనబడని వైనం
- చివరకు బాధితులే పట్టుకుని పట్టాభిపురం స్టేషన్‌లో అప్పగింత
- బాధితులు లేని సమయంలో నిందితుడిని వదిలివేసిన పోలీసులు

పట్నంబజారు: మీకు ఉద్యోగాలు ఇప్పిస్తాననంటూ ఎంతో మంది యువకులను మోసం చేసిన వ్యక్తి కొంతకాలంగా తప్పించుకుని తిరుగుతున్నాడు. చివరకు బాధితులే నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కానీ పోలీసులు అతనిని వదిలివేసిన సంఘటన గుంటూరు నగరంలో చోటుచేసుకుంది. బాధిత యువకులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమండ్రికి చెందిన కోమల్ కొంత మంది యువకులను ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మబలికి మోసం చేశాడు. తనకు ఎంతో మంది పెద్దలతో పరిచయాలు ఉన్నాయంటూ వారిని నమ్మించి గుంటూరుకు చెందిన సుమారు ముగ్గురు యువకుల వద్ద రూ.12 నుంచి రూ.14 లక్షల వరకు పలు దఫాలుగా తీసుకున్నాడు. గత ఆరు నెలల నుండి డబ్బులు తీసుకున్న కోమల్ కనిపించకపోవడంతో డబ్బు చెల్లించిన యువకులు నిందితుడి కోసం వెతుకులాట ప్రారంభించారు. ఎట్టకేలకు ఈనెల 17వ తేదీన విజయవాడలో పట్టుకున్నారు. డబ్బులు చెల్లించిన వారు విద్యానగర్‌కు చెందిన యువకులు కావడంతో సదరు మోసం చేసిన కోమల్‌ను పట్టాభిపురం స్టేషన్‌కు తీసుకొచ్చి అప్పజెప్పారు. ఎస్సై శరత్ చంద్ర సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరించేందుకు దృష్టి సారించారు. 17వ తేదీ రాత్రి నిందితుడికి తీసుకెళ్లగా మరుసటి రోజు ఉదయం తీసుకురావాలని యువకులకు పోలీసులు సూచించారు. దీంతో ఉదయం యువకులు కోమల్‌ను తీసుకుని పట్టాభిపురం స్టేషన్‌కు తీసుకెళ్లారు. స్టేషన్‌లో ఉన్న ఒక కానిస్టేబుల్‌కు అప్పజెప్పి యువకులు స్టేషన్ బయటే సీఐ కోసం ఎదురు చూస్తున్నారు. బాధితుల వద్ద ఉన్న నిందితుడి ఫోన్ కూడా కానిస్టేబుల్ వారిని బెదిరించి తీసుకుని నిందితుడికి అప్పజెప్పాడు. అతనికి స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఓ ఏఎస్సై కూడా వత్తాసు పలికాడు. ఈ క్రమంలో ఫోన్ తీసుకున్న ఆరోపణలు ఎదుర్కొంటున్న కోమల్‌ను కానిస్టేబుల్ పట్టీపట్టనట్లు వ్యవహరించడంతో మెల్లిగా అతను అక్కడి నుండి ఉడాయించాడు. ఇదే విషయాన్ని వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ మహేష్, పట్టాభిపురం సీఐ శరత్‌చంద్ర దృష్టికి తీసుకెళ్లడంతో కానిస్టేబుల్, ఏఎస్సైలను ప్రశ్నించగా నీళ్లు నులిమిలారు. ఎట్టకేలకు ఉద్యోగాలు ఇప్పిస్తామని యువకులను మోసం చేసిన వ్యక్తి యథేచ్ఛగా పరారై స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. దీనిపై ఉన్నతాధికారులు విచారించి నిందితుడిని పట్టుకోవడంతోపాటు, అతనిని సహకరించిన కానిస్టేబుల్, ఏఎస్సైలపై చర్యలు తీసుకోవాలని యువకులు కోరుతున్నారు.

నిబంధనల ప్రకారమే ఇసుక లోడింగ్

- ఏవైనా సమస్యలుంటే టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయొచ్చు
- కొల్లిపర ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి

తెనాలి: కొల్లిపర మండలంలోని కొల్లిపర, మున్నంగి గ్రామాల్లో గల స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక లోడింగ్‌లో కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నట్లు కొల్లిపర మండల ఇన్‌ఛార్జి తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్నంగిలోని ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఈనెల 16న లారీ లోడింగ్‌కు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కన్నా అదనంగా రూ.2,000 వసూలు చేశారనేది అవాస్తవమన్నారు. దీనిపై తాను విచారించినట్టు తెలిపారు. స్టాక్ యార్డు వద్ద విధుల కోసం నియమించిన ఉద్యోగులు టోకెన్లు పంచటం ద్వారా వరుసలో ఉన్న వాహనాలకు మాత్రమే ఇసుక లోడ్ చేస్తున్నట్టు తెలిపారు. అదనంగా ఇసుక లోడు చేయటం, అందుకు అదనంగా డబ్బులు వసూలు చేయటం వాస్తవం కాదన్నారు. నిర్ణీత సమయం వరకు లోడింగ్ జరుగుతోందని, ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ చేయటం లేదని స్పష్టంచేశారు. ప్రతి లోడింగ్ పాయింట్ వద్ద పర్యవేక్షణకు డ్వాక్రా సిబ్బంది, ప్రభుత్వ సిబ్బందిని నియమించామని, సీసీ కెమెరాలు కూడా అమర్చామని గుర్తుచేశారు. ఇసుక క్రయవిక్రయాల్లో ఏవైనా సమస్యలుంటే జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. స్థానిక అధికారులకు వినియోగదారులు ఎవ్వరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

బోధనా నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి

పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి



డైట్ కళాశాలలో మాట్లాడుతున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రపంచ బ్యాంకు సహకారంతో ఎస్సీఈఆర్టీ, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాస్థాయి టీచ్ టూల్ శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. బోయపాలెంలోని డైట్ కళాశాల, తెనాలిలోని సెయింట్ జాన్ ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను సందర్శించిన ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. మారుతున్న కాలానుగుణంగా ఉపాధ్యాయుల్లో వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి పర్చడంతోపాటు విద్యార్థి కేంద్రంగా బోధనా పటిమను తీర్చిదిద్దేందుకు శిక్షణా కార్యక్రమం దోహదం చేస్తుందని చెప్పారు. జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు వివిధ అంశాలపై రిసోర్స్‌పర్సన్లు శిక్షణ కల్పించారు. బోయపాలెం డైట్ కళాశాలలో 120 మంది, తెనాలిలో 115 మంది చొప్పున ఉపాధ్యాయులకు ఈనెల 27 వరకు శిక్షణా శిబిరం జరగనుందని లీడర్ షిప్ ఫర్ ఈక్విటీ ఇన్‌చార్జ్ తోట వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా, సీనియర్ అధ్యాపకులు సుభానీ పాల్గొన్నారు.

నీటి నాణ్యత పరిశీలించిన కేంద్ర బృందం



కొళాయి నీటి నాణ్యత పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

తాడికొండ: తుళ్లూరు మండలంలోని వెలగపూడి, మల్కాపురం, అబ్బరాజుపాలెం గ్రామ పంచాయతీల పరిధిలో గురువారం కేంద్ర పరిశీలన బృందం సభ్యులు పర్యటించారు. ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్‌లు, నీటి నాణ్యత, పరిమాణం, శుభ్రత మొదలైన అన్ని పరిమాణాలు పాటిస్తూ నీటి సరఫరా జరుగుతుందా అనే విషయాన్ని పరిశీలించారు. ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యులను పలకరించి కొళాయిల ద్వారా సరఫరా అవుతున్న నీటి నాణ్యతను అడిగి తెలుసుకొని నీటిని సేకరించి అక్కడే పలు పరీక్షలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో పర్యటించి నీటి శుభ్రతా పరిమాణాలు పాటించాల్సిన అంశాలపై తగు సూచనలు అందజేశారు. కేంద్ర బృందం పరిశీలన సభ్యులు శ్రీ విద్య, జయకుమారి, సుజాత, మురళీ, నిశాంత్‌లు పర్యటించి వివరాలు నమోదు చేసుకోగా వీరి వెంట జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్టు మేనేజర్ పి కిరణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎం రేష్మ, జేజేఎం జిల్లా కో ఆర్డినేటర్ రంగారావు, స్వచ్ఛ భారత్ మిషన్ తుళ్లూరు మండల కో ఆర్డినేటర్ కె బిక్షం, ఆయా గ్రామాల కార్యదర్శులు, ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.